క్లుప్తంగా

రామాలయ నిర్మాణానికి విరాళాల వెల్లువ



విరాళం అందజేస్తున్న సోమవరం సర్పంచ్ శ్రీనివాసరావు

మునగపాక: తిమ్మరాజుపేటలో నిర్మిస్తున్న రామాలయానికి భక్తులు తమవంతు విరాళాలు అందజేస్తున్నారు. కశింకోట మండలం సోమవరం పంచాయతీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు రూ.50 వేలు విరాళం అందజేశారు. సోమవరం పాల సంఘం అధ్యక్షుడు గూడపు సూర్యప్రకాశరావు దంపతులు బుధవారం కమిటీ సభ్యులకు రూ.25వేలు అందించారు. ఈ కార్యక్రమంలో సూరిశెట్టి రాము, పచ్చికూర నరసింగరావు, సత్యారావు, మల్ల స్వామి, శరగడం వెంకునాయుడు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మేలుజాతి పశువుల పెంపకం మేలు

మునగపాక: మేలుజాతి పశువుల ద్వారా మెరుగైన ఆదాయం పొందవచ్చని తిమ్మరాజుపేట పశువైద్యాధికారి జె.పద్మజ అన్నారు. మండలంలోని తిమ్మరాజుపేటలో బుధవారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించి రైతులకు ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా పాల దిగుబడులు పెంచుకోవాలంటే పశువుల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సీజన్‌లో ఎటువంటి వ్యాధులు సోకకుండా ఉండేందుకు ముందస్తుగా టీకాలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో భీమరశెట్టి శ్రీనివాసరావు, శరగడం జగన్నాథరావు, బీవీ కృష్ణారావు, బీవీ రమణ, సూరిశెట్టి రాము, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

అడ్డురోడ్డు చేరుకున్న జీపు జాతా

ఎస్.రాయవరం: పర్యావరణానికి అత్యంత ప్రమాదకరంగా మారనున్న నక్కపల్లి బల్క్ డ్రగ్స్ కంపెనీ నిర్మాణ పనులు వెంటనే నిలిపివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం చేపట్టే ప్రజా వ్యతిరేక విధానాలపై అవగాహన కల్పించేందుకు శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు తలపెట్టిన జీపు జాతా బుధవారం అడ్డురోడ్డు జంక్షన్‌కు చేరుకుంది. ఇలా ప్రభుత్వ విధానాలు ఎండగడుతూ జాతా ముందుకు సాగింది.


డ్రమ్ సీడర్‌తో సాగు ఖర్చు తక్కువ



నాట్లు పరిశీలిస్తున్న శాస్త్రవేత్త రమణమూర్తి

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లిలో జరుగుతున్న వరినాట్లను బుధవారం అనకాపల్లి ఆర్‌ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ కేవీ రమణమూర్తి పరిశీలించారు. డ్రమ్‌సీడర్ ద్వారా నాట్లు వేసే పద్ధతిని ఆయన పరిశీలించారు. డ్రమ్‌సీడర్ ద్వారా నాట్లు వేసుకోవడం ద్వారా ఖర్చు తగ్గుతుందన్నారు. వరిసాగులో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనకాపల్లి వ్యవసాయ సంచాలకుడు డాక్టర్ రామారావు, మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా వల్లభేశ్వరస్వామి తీర్థం



పూజలందుకున్న వల్లభేశ్వరస్వామి

ఎస్.రాయవరం: బంగారమ్మపాలెం గ్రామంలో వల్లభేశ్వర స్వామి తీర్థం బుధవారం ఘనంగా జరిగింది. తీరం పర్వతంపై కొలువుదీరిన స్వామిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. వేకువజాము నుంచితీరంలో సముద్ర స్నానాలు ఆచరించిన భక్తులు క్యూలో నిల్చుని స్వామికి ఎరుపు జెండాను సమర్పించి దర్శించుకున్నారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిలాడింది.

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఎస్.రాయవరం: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రక్షణ పొందేందుకు అవసరమైన చర్యలపై అవగాహన ఉండాలని యలమంచిలి అగ్నిమాపక సిబ్బంది అన్నారు. ఈ మేరకు బుధవారం దార్లపూడి ఉన్నత పాఠశాలలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఇళ్లలో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తక్షణ చర్యలు, తుపానులు సంభవించినప్పుడు పొందే రక్షణ, భూకంపాలు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

పొగాకు సాగు.. లాభాలు బాగు

- ఎకరాకు రూ.90 వేల వరకు ఆదాయం
- ఆసక్తి చూపిస్తున్న రైతులు
- కోటవురట్ల మండలంలో 160 ఎకరాల్లో పంట



సుర్లవానిపాలెంలో పొగాకు పంట

కోటవురట్ల: పొగాకు సాగుపై రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం రావడంతో పలువురు రైతులు సాగుకు మక్కువ చూపుతున్నారు. ప్రధానంగా మెట్ట ప్రాంతాలలో నేలలు అనుకూలంగా ఉండడంతో ఈ పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. పలు కంపెనీల నుంచి కొనుగోలుదారులు సాగుకు పెట్టుబడి సాయం చేయడంతో పాటు నేరుగా మకానికి వచ్చి వారే పంటను తీసుకెళుతుంటారు. దాంతో రైతుపై పెద్దగా భారం పడకపోగా ఒత్తిడి కూడా ఉండదు. గత ఏడాది క్వింటా ధర రూ.15 వేలు పలకగా ఈ ఏడాది పెరిగే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు. మండలంలోని సుమారు 160 ఎకరాలలో పొగాకు పంట సాగులో ఉండగా పాములవాక, భీమిరెడ్డిపాలెం, సుర్లవానిపాలెం, చినబొడ్డేపల్లి, కొత్తూరు, పి.కె.పల్లి, బోడపాలెం, రామన్నపాలెం, కొడవటిపూడి, కె.వెంకటాపురం, నీలిగుంట, సన్యాసిరాజుపాలెం, తిమ్మాపురం, లింగాపురం, రామచంద్రపాలెం ప్రాంతాలలో ఎక్కువగా ఉంది.

పెట్టుబడి ఇలా..

ఎకరా పరిధిలో పొగాకు సాగుకు మొక్క నాటిన నుంచి పంట తీసేంత వరకు అన్ని ఖర్చులు కలుపుకొని సుమారు రూ.30 వేలు వరకు అవుతోంది. మొక్క నాటాక రెండు నెలల పాటు మిడత రాకుండా చూసుకోవాలి. ఆ తరువాత లద్దెపురుగు ఆశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పరిస్థితులు అనుకూలిస్తే ఎకరాకు సుమారు 8 క్వింటాలు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఈ రకంగా రైతుకు ఎకరాకు సుమారు రూ.1.20 లక్షలు వచ్చే అవకాశం ఉంది. పెట్టుబడి పోను సుమారు రూ.90 వేలు మిగిలే అవకాశం ఉండడంతో పలువురు రైతులు పొగాకు సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు.

మునగపాక మండల అభివృద్ధికి కృషి చేయాలి



జెడ్పీ సీఈవో నారాయణమూర్తిని సత్కరిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి, ఎంపీడీవో ఉషారాణి

మునగపాక: మునగపాక మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ప్రజా సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అధికారులు ముందస్తు ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీలకు రహదారుల ఏర్పాటుకు గ్రావెల్ ఉపయోగించామని, ఇంత వరకు బిల్లులు రాలేదని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు వచ్చేలా చూడాలని కోరారు. ఇందుకు స్పందించిన సీఈవో నారాయణమూర్తి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున రాత పూర్వకంగా అధికారులకు సమస్య నివేదించాలని సూచించారు. కోడ్ అమలులో ఉన్నందున శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించరాదన్నారు. జిల్లా పరిషత్ ఉత్తమ సీఈవోగా అవార్డు అందుకున్న నారాయణమూర్తిని ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఎంపీడీవో ఎం.ఉషారాణి, తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు బోజా లక్ష్మి, మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవం



ఎస్ఐ ప్రసాదరావుకు గౌరీపరమేశ్వరుల ఉత్సవ పోస్టర్‌ను అందజేస్తున్న కమిటీ సభ్యులు

మునగపాక: గౌరీపరమేశ్వరుల ఉత్సవం ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని ఎస్ఐ పి.ప్రసాదరావు కోరారు. ఫిబ్రవరి 1న మునగపాకలో జరిగే గౌరీపరమేశ్వరుల ఉత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం కమిటీ సభ్యులు ఎస్ఐకు అందజేశారు. ఉత్సవంలో భాగంగా అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పెంటకోట ఆదినారాయణ, కార్యదర్శి ఆడారి అప్పలనాయుడు, కోశాధికారి పొలిమేర కృష్ణ, కమిటీ సభ్యులు పెంటకోట వెంకట్, ఆడారి మహేష్, ఆడారి కాశీబాబు, విల్లూరి సాయిరాం, ఆడారి గణేష్, ఎంఎం నాయుడు, పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న యలమంచిలి ఎంపీపీ గోవింద్, వైఎస్సార్‌సీపీ నేతలు

మునగపాక: క్రీడలతో మానసిక ఉల్లాసం పొందవచ్చునని యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ జన్మదినం సందర్భంగా మునగపాక నందీశ్వర తులసీ కళావేదిక ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత నరాలశెట్టి సూర్యనారాయణ, సర్పంచ్‌లు భీశెట్టి గంగప్పలనాయుడు, బొడ్డేడ శ్రీనివాసరావు, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, పార్టీ నేతలు టెక్కలి కొండలరావు, ఆడారి కాశీబాబు, రాజాన బుజ్జిబాబు, మళ్ల కృష్ణ, వెంకటప్పారావు, వెంకట్, కాండ్రేగుల జగన్, సరిసా శ్రీనివాసరావు, కొణతాల సంతోష్‌కుమార్, నిర్వాహకులు పెంటకోట శ్రీనివాసరావు, వెలగా రామకృష్ణ, ఆడారి రమణబాబు, కేవీఎస్ అప్పారావు, గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబువి 'సూపర్' మోసాలు

- అధికారం కోసమే అమలు సాధ్యం కాని హామీలు
- మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు ధ్వజం



కంబాలజోగులు

నక్కపల్లి: ఎన్నికల్లో గెలుపొందడం కోసమే చంద్రబాబు అమలు సాధ్యం కాని హామీలను సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చారని, తీరా గెలిచిన తర్వాత ప్రజలను మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట సమన్వయకర్త కంబాల జోగులు ధ్వజమెత్తారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేమని చంద్రబాబు చేతులెత్తేయడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. వెన్నుపోటు పొడవడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని ఆరోపించారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం పథకం కింద ఏటా రూ.15వేలు, రైతు భరోసా కింద ఏటా రూ.20వేలు, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, ప్రతి మహిళకు నెలకు రూ.1500లు, నిరుద్యోగ యువతకు నెలకు రూ.3వేలు చొప్పున ఇస్తామంటూ హామీలు గుప్పించారన్నారు. తీరా అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా హామీలు అమలు చేయలేదన్నారు. చావు కబురు చల్లగా చెప్పినట్లు ఇప్పుడు సంపద లేదు, ఇప్పట్లో ఈ సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయడం సాధ్యం కాదని చేతులెత్తేశారన్నారు. వైఎస్ జగన్ ఉచిత పథకాల కోసం పన్నెండు లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసేశారంటూ తప్పుడు ప్రచారం చేశారన్నారు. నీతిఆయోగ్, కాగ్ ఈ ప్రచారం తప్పని తేల్చాయన్నారు. చంద్రబాబు ప్రతి మంగళవారం రూ.3వేల కోట్లు అప్పులు తెస్తున్నారన్నారు. నెలకు రూ.12వేల కోట్ల చొప్పున ఈ ఎనిమిది నెలల్లో రూ.లక్ష కోట్లు అప్పులు తెచ్చారన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టేనాటికి రాష్ట్ర ఖజానాలో కేవలం రూ.100 కోట్లు ఉందని అప్పటి ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ప్రకటించారని, ఖజానాను టీడీపీ సర్కారే దివాలా తీయించిందన్నారు. అయినప్పటికీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు నవరత్నాలను జగనన్న ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ప్రతి నెలా లబ్ధిదారుడికి ఏదో ఒక పథకం పేరుతో సాయం అందించామని గుర్తు చేశారు. ప్రతి పేదవాడికి ప్రత్యేకంగా పథకాలు ప్రకటించి ఐదేళ్లపాటు నిరాటంకంగా అమలు చేశారన్నారు. చంద్రబాబుకు ఓటేసి ప్రజలు మోసపోయామని బాధపడుతున్నారన్నారు. ప్రభుత్వంపై ఏడాదిలోపే ఇంత వ్యతిరేకత రావడం రాష్ట్ర చరిత్రలో మొదటిశారన్నారు.

సమస్యలు పరిష్కరించాకే బల్క్ డ్రగ్ పార్క్ పనులు ప్రారంభించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

- తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతుల ఆందోళన

నక్కపల్లి: ఏపీఐఐసీకి భూములిచ్చిన రైతులు, నిర్వాసితుల సమస్యలు పూర్తిగా పరిష్కరించిన తర్వాతే బల్క్ డ్రగ్ పార్క్ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ బుధవారం పలువురు నిర్వాసితులు, రైతులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లాకార్యవర్గ సభ్యులు అప్పలరాజు, రైతునాయకులు గింజాల వెంకటరమణ తదితరులు మాట్లాడుతూ రాజయ్యపేట, చందనాడ, డీఎల్ పురం, బుచ్చిరాజుపేట,వేంపాడు తదితర గ్రామాల్లో డీఫారం, ప్రభుత్వ భూములను సాగుచేసుకుంటున్న రైతులకు సంబంధించి జీడిమామిడి తోటలకు నష్టపరిహారం చెల్లించలేదని తెలిపారు. సబ్బవరం మండలంలో పెట్రో యూనివర్సిటీ ఏర్పాటు సమయంలో, నక్కపల్లి మండలం బంగారయ్యపేటలో క్వారంటైల్ ల్యాబ్‌ల కోసం సేకరించిన భూములకు సంబంధించి సాగుదార్లకు, డీఫారం రైతులకు తోటలకు నష్టపరిహారం చెల్లించారని, ఇక్కడ కూడా అదేవిధంగా నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం చేయకుండా బల్క్‌డ్రగ్‌పార్క్ పనులు ప్రారంభించారని ఇది సమంజసం కాదని తెలిపారు. అనంతరం తహసీల్దార్ నర్సింహమూర్తికి వినతి పత్రం ఇచ్చారు. ఈఆందోళనలో శంకరరావు,కోటేశ్వరరావు, ఎం. రాజేష్,మహేష్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

'బ్రాండిక్స్‌లో పని వేళల పెంపును విరమించుకోవాలి'



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

అచ్యుతాపురం: బ్రాండిక్స్‌లో పని చేసే కార్మికుల పనివేళల పెంపు ప్రతిపాదనను యాజమాన్యం వెంటనే విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము, మండల కార్యదర్శి కె.సోమునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం స్థానిక మీడియాతో మాట్లాడారు. రోజుకు 8 గంటల పాటు షిఫ్టుల వారీగా పని చేసే మహిళా కార్మికులు వారి ఇంటి వద్ద బయలు దేరి, తిరిగి ఇంటికి వెళ్లే సమయానికి పని వేళలతో పాటు అదనంగా 6, 7 గంటలు పడుతుందన్నారు. దీని వల్ల తీవ్రంగా అలసిపోతున్న మహిళా కార్మికులకు పెంచిన అర గంట మరింత ఇబ్బందికి గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పని వేళల పెంపు విషయంలో యాజమాన్యం పునరాలోచించి తగిన నిర్ణయం తీసుకోవడంతో పాటు, కార్మికుల ఆరోగ్య భద్రతపై శ్రద్ధ చూపాలని వారు కోరారు.

మున్సిపల్ సమావేశం వాయిదా

యలమంచిలి రూరల్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. దీంతో గురువారం జరగాల్సిన యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాయిదా పడింది. పురపాలక సంఘ పాలకవర్గ సమావేశం నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వార్డు కౌన్సిలర్లకు అజెండా కూడా పంపించారు. ఈ లోగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమ్మల్లోకి రావడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు తెలిపారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

పాయకరావుపేట: మండలంలోని కేశవరం, రాజవరం గ్రామాల్లో మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర సందర్శన అనంతరం రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఎన్‌పీఎస్ఎస్ యాప్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవో జి.నాగశరత్, వీఎఫ్ఏ టి.ఎస్.సంజీవిని, వీఆర్ఏ కాకడ బండిరావు, ఎస్.సతీష్, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

అపరాల సాగుపై రైతులకు అవగాహన

యలమంచిలి రూరల్: మండలంలోని ఏటికొప్పాక, బయ్యవరం గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి పొలిమేర మోహన్‌రావు అపరాల సాగు, నువ్వులు, రాగి పంటలు చేస్తున్న రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా మినుము, పెసలు వంటి పప్పు దినుసుల సాగులో ఎటువంటి సస్యరక్షణ చర్యలు చేపట్టాలో వివరించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను బట్టి డై మీథియేట్ మందును వేపనూనెతో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మంచి దిగుబడులు సాధించాలంటే ఏం చేయాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు రీనా, సుగంధి, రైతులు అప్పారావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

షూట్‌బాల్ లాటరీ జూదాన్ని ఆపాలి



అచ్యుతాపురంలో ఏర్పాటు చేసిన షూట్‌బాల్ లాటరీ

అచ్యుతాపురం: అచ్యుతాపురంలో ఏర్పాటు చేసిన షూట్‌బాల్ లాటరీని వెంటనే ఆపాలని సీపీఎం నాయకుడు ఆర్.రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం లాటరీ నిర్వహణ ప్రాంతం వద్ద సీపీఎం నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. తక్షణమే పోలీసులు జోక్యం చేసుకుని ఇటువంటి లాటరీలను నిషేధించాలని కోరారు. ఇటువంటి కార్యకలాపాల వల్ల ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారని రాము తెలిపారు.